ఉష్ణోగ్రత
గరిష్ఠం 35.5
కనిష్ఠం 23.6


రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్రం

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మే 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో మత రాజకీయాల ద్వారా విద్వేషాలను రెచ్చగొడుతూ ఐక్యతను దెబ్బతీస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న మోదీ సర్కార్ తీరును ప్రజలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. మండల, పట్టణ అధ్యక్షులు జగన్, మానయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోదీ సర్కార్ విధానాల మూలంగా రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు దేశ ప్రజలందరూ ఏకమై కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, మాజీ ఎంపీపీ ధనుంజయ, జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, తాళ్ల రవీందర్, శ్రీశైలం, అంజయ్యగుప్త, కాలే మల్లయ్య, విజయ్, ఖాదర్, కృష్ణనాయక్, అప్పం శ్రీను, అలీమ్, ఫరీద్, మహేశ్ పాల్గొన్నారు.

పేకాట.. యువత చెడుబాట!

పేట్రేగిపోతున్న పేకాటరాయుళ్లు
పశువుల పాకలు, గుడిసెలే స్థావరాలు
పోలీసులకు దొరక్కుండా జాగ్రత్తలు




వివరాలు 8లో..

భాస్వరం, పొటాషియం అనేక రెట్లు ఎక్కువ
జింకు, సేంద్రియ కర్బనాల లోపం
విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం
పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం
వ్యవసాయాధికారుల సలహాలు పాటిస్తే మేలు



ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ భూములు రోజురోజుకూ నిస్సారంగా మారుతున్నాయి. పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే ఆత్రుతతో రైతులు రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడేస్తున్నారు. మొక్క మొలిచింది మొదలు... పూత పూసి.. కాయ కోసే వరకు మందుల వినియోగం మితిమీరిపోయింది. ఇలా చేయడం వల్ల నేలల్లో నత్రజని పూర్తిగా తగ్గిపోయినట్లు కేంద్రం ఇటీవల నిర్వహించిన భూసార పరీక్షల్లో వెల్లడైంది. అంతేకాకుండా భాస్వరం, పొటాషియం ఉండాల్సిన మోతాదు కంటే అనేక రెట్లు అధికంగా ఉన్నట్లు తేలింది. భూమంతా భాస్వరమయంగా మారడంతో పంట ఉత్పత్తుల్లో వ్యత్యాసాలు వస్తున్నాయి. ఇప్పటికైనా రైతులు మేలుకోకపోతే ముమ్మందు వ్యవసాయ భూములు సాగుకు పనికిరాకుండా పోయే ప్రమాదముంది.



భూసారం నిస్సారం!


ఉమ్మడి జిల్లా నేలల్లో తగ్గిన నత్రజని

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడడంతో భూసారంలో భారీ వ్యత్యాసాలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయి. కేంద్రం ఇటీవల నిర్వహించిన భూసార పరీక్షల్లో ఉమ్మడి జిల్లాలో ఆశ్చర్యకరమైన విషయాలు వెల్లడయ్యాయి. మొక్కల ఎదుగుదలలో కీలకమైన నత్రజని శాతాన్ని పెంచేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నా ఇంకా మెరుగుపడలేదు. కొన్ని ప్రాంతాల్లో కనీస స్థాయిలో కూడా నత్రజని లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అలాగే భాస్వరం, పొటాషియం ఉండాల్సిన మోతాదు కంటే అనేక రెట్లు అధికంగా ఉన్నట్లు తేలింది. రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులు వాడడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. తాజా భూసార పరీక్షల్లో మూడు జిల్లాల్లోని భూముల్లో నత్రజని లోపం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలో 99.4శాతం భూముల్లో నత్రజని లోపం ఉన్నట్లు ఫలితాల్లో వెల్లడైంది. అలాగే రంగారెడ్డిజిల్లాలో 57.5శాతం నత్రజని లోపం కనిపించింది. మేడ్చల్ జిల్లాలో 17.8శాతం తక్కువ నమోదైంది. అలాగే సేంద్రియ కర్బన పదార్థాలు., సల్ఫర్, ఇనుము, జింకు, కాపర్, బొరాన్ లోపం ఎక్కువగానే ఉంది. పంటల సీజన్ ప్రారంభం కాగానే వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలను పట్టించుకోకుండా రైతులు పోటీపడి ఎరువులను వాడుతున్న విషయం తెలిసిందే. దీంతో భూసారంలో

మిగతా 7వ పేజీలో...

పరీక్షల ఫలితాలు

భూసార లోపం (శాతాల్లో)



నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

» జిల్లాలో 103 కేంద్రాల ఏర్పాటు
» హాజరు కానున్న 60,800 మంది విద్యార్థులు

రంగారెడ్డి అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 22 నుంచి 29వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో మొత్తం 103 పరీక్ష కేంద్రాల్లో 60,800 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 40వేలకు పైచిలుకు ఫస్టియర్, 20వేలు సెకండియర్ విద్యార్థులున్నారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యాన్ని సిద్ధం చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి ఫోన్‌లను నిషేధించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు : డీఐఈవో

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఐఈవో వెంక్యానాయక్ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగింది. పరీక్షల పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిట్టింగ్ స్క్వాడ్స్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

ఇబ్రహీంపట్నం ఎస్‌ఐపై వేటు

» భువనగిరి-యాదాద్రి జోన్‌కు అటాచ్

ఇబ్రహీంపట్నం, మే 21(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎస్సై శ్రీనివాస్‌పై వేటు పడింది. ఆయన్ను భువనగిరి-యాదాద్రి జోన్‌కు అటాచ్ చేస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పనిచేసిన భువనగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కేసు విచారణను సక్రమంగా చేయలేదని క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ బడుల్లో ఏఐ తరహా విద్య

» విద్యార్థుల సంఖ్యను పెంచాలి
» డీఈవో సుశీంద్రరావు


మాట్లాడుతున్న డీఈవో సుశీంద్రరావు

ఇబ్రహీంపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ తరహా విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్రరావు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని గురుకుల విద్యాపీఠ్ పాఠశాలలో ఇబ్రహీంపట్నం, యాచారం మండలాల ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు కెపాసిటీ బిల్డింగ్ ప్రాథమిక స్థాయి అంశంపై శిక్షణ నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అత్యాధునిక సాంకేతికతను జోడించి విద్యను బోధించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మత్తు పదార్థాల జోలికి పోకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ హీర్యానాయక్, యాచారం మండల విద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ పరమేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విమానంలో మహిళ హల్‌చల్

» ఎమర్జెన్సీ డోర్ తీయడానికి యత్నం
» ఎయిర్‌లైన్స్ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగింత
» ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని గుర్తింపు

శంషాబాద్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి భువనేశ్వర్ వెళ్తున్న ఇండిగో విమానంలో మహిళా ప్రయాణికురాలు హల్‌చల్ చేసింది. ఎమర్జెన్సీ డోర్ తీయడానికి యత్నించిన ఆమెను ఎయిర్‌లైన్స్ సిబ్బంది అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్ విమానాశ్రయం నుంచి భువనేశ్వర్ వెళ్తున్న ఇండిగో విమానం పార్కింగ్ స్థలం నుంచి టేకాఫ్ తీసుకోవడానికి రన్‌వే పైకి వెళ్తుండగా కర్ణాటకకు చెందిన ఓ మహిళ ప్రయాణికురాలు ఎమర్జెన్సీ డోర్ తీయడానికి యత్నించింది. ఎయిర్‌లైన్స్ సిబ్బంది ఆమెను అడ్డుకున్నారు. దీంతో సిబ్బందితో ఆ మహిళ వాగ్వాదానికి దిగింది. విమానాన్ని ఆపి మహిళను ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రయాణికురాలికి మతిస్థిమితం సరిగా లేదని పోలీసులు గుర్తించారు.



ఫ్లైట్ టైర్లలో సాంకేతిక సమస్య

» విమానం రద్దు చేసిన అధికారులు.. తప్పిన ప్రమాదం

శంషాబాద్ విమానాశ్రయం నుంచి 160 మంది ప్రయాణికులతో ఫ్రాంక్‌ఫర్ట్ వెళ్లాల్సిన ఎల్ఎక్స్ 753 లుఫ్తాన్సా విమానానికి పెను ముప్పు తప్పింది. బుధవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఫ్రాంక్‌ఫర్ట్ బయలుదేరడానికి పార్కింగ్ స్థలం నుంచి టేకాఫ్ తీసుకోవడానికి రన్‌వే పైకి వెళ్తుండగా టైర్లలో సాంకేతిక సమస్య(గాలి) తలెత్తింది. ఇది గమనించిన పైలెట్లు వెంటనే ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. ఏటీసీ అధికారుల అనుమతితో తిరిగి విమానాన్ని పార్కింగ్ స్థలానికి తీసుకెళ్లారు. అక్కడ సాంకేతిక నిపుణులు విమానాన్ని పరిశీలించి విమానంలో అన్ని టైర్లలో గాలి తక్కువగా ఉన్నట్లు తెలిపారు. దీంతో విమాన సర్వీసును అధికారులు రద్దు చేశారు. వెంటనే జీఎంఆర్ అధికారులు ఎమర్జెన్సీ సేవల సిబ్బందిని అప్రమత్తం చేశారు. అయితే కొందరు ప్రయాణికులు ప్రయాణాన్ని రద్దు చేసుకోగా, మరికొందరు ఇతర విమానాల ద్వారా ఫ్రాంక్‌ఫర్ట్ పంపించేందుకు ఏర్పాట్లు చేశామని ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. విమానం టేకాఫ్ సందర్భంగా ఇంజనీర్లు పూర్తిగా తనిఖీలు చేయకుండా ఏం చేస్తున్నారని ప్రయాణికులు మండిపడ్డారు.


పూర్తయిన సున్నం చెరువు కట్ట వెడల్పు పనులు

సున్నం చెరువుకు మహర్దశ

సుందరీకరణకు 'అమెజాన్' సొంత నిధుల కేటాయింపు
చెరువుకట్ట వెడల్పు, అలుగు మరమ్మతులు
పూర్తయిన పనులకు నేడు ప్రారంభోత్సవం

కందుకూరు, మే21(ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలం కొత్తగూడ గ్రామంలోని సున్నం చెరువుకు మహర్దశ పట్టనుంది. అమెజాన్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ(సీఎస్ఆర్) నిధుల ద్వారా చెరువు సుందరీకరణ పనులను చేపట్టింది. నెల రోజుల పాటు అరకిలోమీటర్ దూరం ఉన్న చెరువు కట్ట వెడల్పు, దానికి ఇరువైపులా రాతికట్ట పనులు చేపట్టారు. కట్ట అలుగు మరమ్మతులు చేయించారు. మండలంలోని పెద్ద చెరువులలో

మిగతా 8వ పేజీలో...



సంతోషంగా ఉంది

కొన్నేళ్లుగా చెరువులోని నీరు జాలువారి వృథాగా పోయేది. చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టడంతో పాటు కట్టకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించారు. అలుగు మరమ్మతులు కూడా చేపట్టడం సంతోషంగా ఉంది. ఇంతకుముందు కట్టపై నుంచి బావుల వద్దకు వెళ్లాలంటే భయమేసేది. ప్రస్తుతం రెండు కార్లు వెళ్లే పరిస్థితిని కల్పించిన అమెజాన్ సంస్థకు కృతజ్ఞతలు.

తాళ్ల శంకరయ్య, ఆయకట్టు రైతు

3 నెలల్లో ఇళ్లు పూర్తి చేసుకోండి

● ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 21(ఆంధ్రజ్యోతి): మంజూరు పత్రాలు పొందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మూడు నెలల్లో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. బుధవారం పట్నంలోని క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు 872 మందికి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఈనెల 25లోపు పనులు మొదలు పెట్టాలన్నారు. మూడేళ్లలో మొత్తంగా 20 వేల ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎవరైనా ఇల్లు మొదలుపెట్టి మధ్యలో ఆపేస్తే బిల్లులు రావనే విషయం గుర్తెరగాలన్నారు. ఆర్డీవో కె.అనంతరెడ్డి, జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ చంప్లానాయక్, ఏసీపీ కేపీవీ రాజు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్ పాల్గొన్నారు.


లబ్ధిదారుకు మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎండ, వాన దోబూచులాట

మరో రెండు రోజులు ఇదేతీరు

వాతావరణంలో నెలకొన్న అనిశ్చితి

కొన్ని ప్రాంతాల్లో భగభగలు, మరికొన్నిచోట్ల వర్షాలు
మొయినాబాద్‌లో అత్యధికంగా 35.5 డిగ్రీల ఉష్ణోగ్రత, 55.0 మి.మీ.ల వర్షపాతం నమోదు

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం/మొయినాబాద్ రూరల్/షాబాద్/చౌదరిగూడ, మే 21 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో అనిశ్చితి కొనసాగుతోంది. కొన్నిప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా మరికొన్ని చోట్ల ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో పాటు ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. జిల్లాలో బుధవారం 35.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత మొయినాబాద్‌లో నమోదైంది. ఇదే మండలంలో వింత పరిస్థితి కనిపించింది. ఓ వైపు ఎండ.. మరో వైపు వాన దంచికొట్టింది. మొయినాబాద్‌లో కురిసిన వర్షానికి 55.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారంలో 54.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్దలో 38.5 మిల్లీమీటర్లు, ఎలిమినేడులో 38.5 మిల్లీమీటర్లు, చౌదరిగూడ మండలం కాసులాబాద్‌లో 34.5 మిల్లీమీటర్లు, కొందుర్గులో 32.0 మిల్లీమీటర్లు, చిలుకూరు మృగవనిలో 32.0 మిల్లీమీటర్లు, నందిగామలో 30.0మిల్లీమీటర్లు, శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో 24.5 మిల్లీమీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 21.0 మిల్లీమీటర్లు, కేతిరెడ్డిపల్లిలో 20.5 మిల్లీమీటర్లు, మంచాలలో

మిగతా 8వ పేజీలో...


ఉధృతంగా ప్రవహిస్తున్న బొప్పిలిగామ వాగు

సాగులో అధికారుల సూచనలు పాటించాలి

మర్పల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి పొందొచ్చని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్లూర్ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రసాయన ఎరువుల అధికంగా వాడితే భూసారంతగ్గుతుందన్నారు. సేంద్రీయ ఎరువుల వాడకంతో దిగుబడి పెరుగుతుందన్నారు. శాస్త్రవేత్తలు రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త యమున, ఏవో శ్రీకాంత్, కాంగ్రెస్‌మండల అధ్యక్షుడుసురేశ్ పాల్గొన్నారు.

రేపు రైతులకు అవగాహన కార్యక్రమం

పెద్దేముల్: వర్షాకాలంలో సాగుపై రైతులను సమాయత్తం చేసేందుకు తాండూరు వ్యవసాయపరిశోధన స్థానం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని ఏవో పవన్‌ప్రీతమ్ తెలిపారు. పెద్దేముల్‌లోని రైతువేదికలో 'రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు, శుక్రవారం ఉదయం 8గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.


కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

అధికారికంగా భాగ్యరెడ్డివర్మ జయంతి

తాండూరు, మే 21(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, రాజకీయవేత్త భాగ్యరెడ్డివర్మ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని సర్కారు నిర్ణయించింది. రాష్ట్ర కార్యక్రమంగా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. మున్సిపల్, స్థానిక సంస్థల్లో జయంతి ఉత్సవాలను నిర్వహించాలని బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి.

జీలుగ విత్తనాలు సరఫరా చేయాలి

కులకచర్ల, మే 21(ఆంధ్రజ్యోతి): సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. వర్షాకాలం రానున్న తరుణంలో జీలుగ, పచ్చిరొట్ట, జనుము విత్తనాల సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 25న రోహిణి కార్తె ప్రారంభం కానుంది. 45 రోజుల్లో పంటలు విత్తుకోనున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

అధికారుల తీరుతో రైతులకు నష్టం

ధారూరు, మే21(ఆంధ్రజ్యోతి): అధికారులు వెంటవెంటనే ధాన్యం కొనుగోలు చేయక వర్షాలతో వడ్లు తడిసి రైతులు నష్టపోతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నాగారం, గురుదోట్ల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను బుధవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో హమాలీల కొరత, లారీలు రాక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. సమస్య పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. తడిస వడ్లను కొంటామని మంత్రులు చెబుతున్నా మిల్లర్లు తూకంలో భారీ కోతలు పెడుతున్నారని చెప్పారు. జిల్లాలో బాయిల్డ్ రైస్ కోసం ధాన్యం నిల్వకు ఇంటర్మీడియరీ గోదాంలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమస్యలన్నీ తీర్చాలని జిల్లా కలెక్టర్, డీఎస్‌వోలను ఆయన కోరారు. కాగా గురుదోట్లలో ఏఈవో సంజూరాథోడ్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజునాయక్, వివేకానందరెడ్డి, సుధాకర్ ఆచార్య పాల్గొన్నారు.

వెంటవెంటనే ధాన్యాన్ని తరలించాలి

బొంరాస్‌పేట్/తాండూరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలం కొత్తూర్ కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడారు. లారీలు రావడం లేదని, బస్తాలు ఇవ్వడం లేదని రైతులు ఆయనతో వాపోయారు. స్పందించిన అధికారి రైతుల సమస్యలు తీరుస్తామని చెప్పారు. తాండూరు మండలం చెంగోల్ కొనుగోలు కేంద్రాన్ని లింగ్యానాయక్ సందర్శించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని తహసీల్దార్ తారాసింగ్, డీసీఎంఎస్ అధికారి సలీంపాషాను ఆదేశించారు.


రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

మొక్కలు విరివిగా నాటాలి

శామీర్‌పేట, మే 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ కార్యక్రమంలో భాగంగా 'ఉమెన్స్ ఫర్ ట్రీ' నినాదంతో మొక్కలు నాటాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ పిలుపునిచ్చారు.మొక్కలు నాటే కార్యక్రమంపై బుధవారం కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. అమృత్ కార్యక్రమంలో భాగంగా మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ సునీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటగోపాల్

అమృత్ 2.0 లక్ష్యాలు సాధించాలి

తాండూరు: కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0కింద అమృత్ మిత్రలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని గొల్ల చెరువు కట్టపై అమృత్ 2.0 కింద మొక్కలు నాటే కార్యక్రమానికి స్థల పరిశీలన చేసి సూచనలు చేశారు. మొక్కలు నాటడం, సంరక్షణ బాధ్యత అమృత్ మిత్రలదే అన్నారు. మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అమృత్ మిత్రలు ఈ నెల 23 వరకు తల్లిపేరిట మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మణిపాల్, టీఎంసీ రాజేంద్రప్రసాద్, కోఆర్డినేటర్ విశాల, నాయకులు రామకృష్ణ, హబీబ్ లాల, లింగదళి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాపరాతి వ్యర్థాలతో
పానాది రోడ్డు మూసివేత!

తాండూరు రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): రైతులు, స్థానికుల ఉపయోగం కోసం ఏళ్లుగా ఉన్న పానాది రోడ్డును ఓ నాయకుడు నాపరాతి వ్యర్థాలు పోసి మూసేశాడు. లీజు ఒక చోట పొంది మరో చోట తవ్వకాలు చేస్తూ అక్రమాలకు పాల్పడున్నాడు. రోడ్డు మూతతో ప్రజలు చుట్టూతిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఓగీపూర్-కరన్‌కోట్, ఛత్రసాలకు వెళ్లేందుకు 80ఫీట్ల రోడ్డును నిర్మించారు. అయితే గ్రామాల నుంచి కర్ణాటకలోని ఛత్రసాలకు వెళ్లే రోడ్డును ఓ కాంగ్రెస్ నాయకుడు ఇది తన పట్టా భూమి అని కొలతలు వేయించి ఆ రోడ్డులో తవ్వకాలు చేపట్టాడు. రాళ్లు, మట్టి కుప్పలతో రోడ్డును మూసేశాడు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మూసేస్తున్నా అధికారులు పట్టించుకోరా? అని ప్రయాణికులు పేర్కొంటున్నారు. తన భూమి సర్వే చేయించగా అందులో నుంచి రోడ్డు వెళ్తోందని ఓగీపూర్‌నకు చెందిన ఓ నాయకుడు ఆభూమిలో నాపరాతి తవ్వకాలకు సిద్ధం చేశాడు. గతంలో ఇచ్చిన లీజు పత్రాలను చూపుతూ తవ్వకాలు చేస్తున్నాడు. రోడ్డు మూసివేతతో కరన్‌కోట్, ఓగీపూర్, తాండూరు, కర్ణాటక రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి నాయకుడి చెరనుంచి రోడ్డును విడిపించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై పోసిన నాపరాతి వ్యర్థాలు


కుచించుకుపోయిన ఓగీపూర్-ఛత్రసాల లింకు రోడ్డు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలనుఅమలు చేయడంలోకాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ ఉందన్నారు. తులం బంగారం బాకీ ఉందని ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పాఅని ఆమె అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, తహసీల్దార్ సైదులు, కమిషనర్‌వాణి పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే 'కాలె' చెంతకు.. ఏఎంసీ పంచాయితీ

● చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లకు మందలింపు

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, మే 21(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఏఎంసీ పాలకవర్గ పంచాయితీ ఎట్టకేలకు ఎమ్మెల్యే కాలె యాదయ్య చెంతకు చేరింది. ఏఎంసీలో నెలకొన్న విభేదాలు ఒక్కసారిగా రచ్చకెక్కడం, పాలకవర్గంలో లుకలుకలు బహిర్గతం కావడం వంటి అంశాలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, కొంతమంది డైరెక్టర్లు ఒకరిపై మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం.. ఈవిషయం కొన్ని దిన పత్రికలు, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భేదాభిప్రాయాలు మరింత అధికమయ్యాయి. ఈ విషయాన్ని పలువురు పార్టీ సీనియర్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య దృష్టికి తీసుకెళ్లారు. దాంతో బుధవారం ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌చైర్మన్ రాములుతో పాటు డైరెక్టర్లను చేవెళ్లలోని క్యాంపు ఆఫీసుకు పిలిపించుకుని యాదయ్య మందలించారు. మీరేమైనా ఓటింగ్‌తో పదవుల్లోకి వచ్చారనుకుంటున్నారా? మీవి నామినేటెడ్ పదవులు అనే విషయాన్ని తెలుసుకోండి.. ఇలా చేస్తే పదవులు ఊడుతాయంటూ హెచ్చరించారు. మరోసారి మీ పంచాయితీ పేపర్లకు (పత్రికల్లో) ఎక్కితే బాగుండదని వార్నింగ్ ఇచ్చారు. అందరూ కలిసి పనిచేసుకోవాలని, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పాలకవర్గానికి సూచించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు మొక్కలు నాటారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ధారూరు, మే21(ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాలకు చెందిన 30మందికి బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో చైర్మన్ కె.విజయబాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, నాయకులతో కలిసి రూ.17.3లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తన దుకాణాల తనిఖీ

ధారూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ధారూరులోని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలను బుధవారం పరిగి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీకుమారి తనిఖీ చేశారు. మనగ్రోమోర్, తుల్జాభవానీ ఎరువుల దుకాణాల్లో తనిఖీ నిర్వహించి స్టాక్, రికార్డులను, పీసీలు, ఇన్వాయిస్‌లను తనిఖీ చేశారు. పీసీలు లేకుండా విత్తనాలు విక్రయించరాదని ఆదేశించారు. రైతులకు రశీదులు తప్పక ఇవ్వాలని, నిర్దేశించిన ధరలకే విత్తనాలు అమ్మాలని ఆమె తెలిపారు. ఆమె వెంట ఏవో సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న ఏడీఏ లక్ష్మీకుమారి




చెక్కులను అందిస్తున్న గంప వెంకటేశ్

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆమనగల్లు, మే 21(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ కోరారు. అర్హులైన రైతులందరికీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం దీర్ఘకాలిక రుణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. లోడిగ లక్ష్మయ్యకు ట్రాక్టర్, డైరీ ఏర్పాటుకు రూ.10 లక్షలు, బాలగోని కృష్ణయ్యకు డైరీ పరిశ్రమకు రూ.8 లక్షల దీర్ఘకాలిక రుణాల చెక్కులను బ్యాంకు మేనేజర్ అరుణతో కలిసి అందించారు. వెంకటేశ్ మాట్లాడుతూ రైతులకు దీర్ఘకాలిక రుణాలు ఎకరాకు రూ.4 లక్షల చొప్పున రూ.20 లక్షల వరకు అందిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం పంటల సాగుకు ఆమనగల్లు పీఏసీఎస్ ద్వారా రూ.2 కోట్లు అందించాలనే లక్ష్యం నిర్ణయించినట్లు తెలిపారు. డీసీసీబీ మేనేజర్ అరుణ, కిసాన్ మిత్ర డైరెక్టర్ రమేశ్, సింగిల్ విండో సీఈవో దేవేందర్, మహేశ్, రైతులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి

కందుకూరు, మే 21(ఆంధ్రంజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని దెబ్బడగూడ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లను మహేంద్రకుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా 60మంది నిరుపేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందజేసినట్లు ఆయన గుర్తుచేశారు. దెబ్బడగూడలోని నిరుపేద కుటుంబానికి చెందిన సురక్షిత, ప్రవీణలకు సైకిళ్లను అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా అదనపు కార్యదర్శి తాళ్ల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌తోనే పేదల ప్రగతి


షాద్‌నగర్, మే 21(ఆంధ్రజ్యోతి): పేదల ప్రగతి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కూడు, గూడు కోసం పేదలు ఎన్నో అవస్థలు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఎడాదిన్నరలోపే కూడు కోసం సన్న బియ్యం, గూడు కోసం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి సీఎం రేవంత్‌రెడ్డి పేదల గోస తీర్చారని కొనియాడారు. వంట చేసుకోవడానికి రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్న ఘనత ఒక్క తెలంగాణకే దక్కుతుందన్నారు. అర్హులైన వారందరికీ దశల వారిగా ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ బాబర్ ఖాన్, నాయకులు కె.చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, బాలరాజు గౌడ్, బస్వం, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసారం..నిస్సారం!

మట్టి పరీక్షల ఫలితాలు

అధిక భూసారం (శాతాల్లో)







(ఐదో పేజీ తరువాయి)

సమతుల్యత లోపించి పంట భూములు విషతుల్యంగా మారుతున్నాయి. ఈ కారణంగా పంటల దిగుబడిపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది. ప్రస్తుత భూసార పరీక్షల నివేదికల ప్రకారం ఉమ్మడి జిల్లాలో డీఏపీ , పొటాష్ వాడకాన్ని రైతులు బాగా తగ్గించాల్సి ఉంటుంది. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా వ్యవసాయాధికారులు




ఇచ్చే సిఫారస్సుల మేరకు రైతులు ఎరువులు వినియోగిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. భూసారంలో సమతుల్యత కాపాడుకోవడమే కాకుండా పెట్టుబడి ఖర్చు తగ్గి ఆదాయం కూడా పెరుగుతుంది.


మరిన్ని పోషక లోపాలు

ఇక పంటలకు ముఖ్యమైన సేంద్రియ కర్బనాలు తక్కువగానే ఉన్నాయి. సేంద్రియ కర్బనాలు వికారాబాద్ జిల్లాలో 81.4శాతం భూముల్లో తక్కువగా ఉండగా, మేడ్చల్‌లో 58.9 శాతం, రంగారెడ్డి జిల్లాలో 31.6 శాతం తక్కువగా ఉన్నాయి. అలాగే ఇనుము, జింక్, కాపర్, బోరాన్ కూడా తక్కువగానే నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లాలోని 83.1 శాతం భూముల్లో ఇనుము లోపం కనిపించింది. అలాగే వికారాబాద్‌లో 66.9శాతం, మేడ్చల్‌లో 27.8శాతం భూముల్లో తక్కువ ఉంది. మూడు జిల్లాల్లో కూడా బోరాన్ లోపం కనిపించింది.

భూమంతా 'భాస్వర'మయం


రంగారెడ్డిజిల్లా, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని భూముల్లో భాస్వరం చాలా అధికంగా ఉంది. వికారాబాద్ జిల్లాలో 94.8శాతం భూముల్లో భాస్వరం ఉండాల్సిన దాని కంటే అధికంగా ఉంది. అలాగే మేడ్చల్ జిల్లాలో 80శాతం, రంగారెడ్డిజిల్లాలో 48.5శాతం భాస్వరం అధికంగా ఉన్నట్లు ఫలితాల్లో తేలింది. అలాగే వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని భూముల్లో పొటాష్ అధికశాతం ఉండగా రంగారెడ్డిజిల్లాలో తక్కువగా ఉంది. వికారాబాద్ జిల్లాలో పొటాష్ 80శాతం అధికంగా ఉండగా మేడ్చల్ జిల్లాలో 74.4శాతం ఎక్కువగా ఉంది. ఇదే సమయంలో రంగారెడ్డిజిల్లాలో 35.7శాతం పొటాష్ తక్కువగా నమోదైంది. గతంలో రంగారెడ్డిజిల్లాలో కూడా పొటాష్ 80శాతానికిపైగా ఉండేది. ఇక్కడ గడిచిన కొన్నేళ్లుగా పొటాష్ వాడకం రైతులు తగ్గించడంతో ఈ మేర భూసారంలో దాని శాతం తగ్గింది. సాధారణంగా పొటాషియం ఒక హెక్టార్‌కు 280కిలోలకు మించి ఉండకూడదు. వికారాబాద్, మేడ్చల్‌లో కూడా పొటాష్ వాడకాన్ని నియంత్రించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.







మట్టి పరీక్షల ఫలితాలు

భూసార లోపం (శాతాల్లో)







ఎమ్మెల్యే చొరవతో నీటి సమస్య పరిష్కారం

కేశంపేట, మే 21(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో వారం రోజులుగా నీటి ఎద్దడి నెలకొంది. సమస్యను కాంగ్రెస్ నాయకుడు బీస కరుణాకర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోగా, 7 హెచ్‌పీ మోటర్ పంపు ఇప్పించారు. బుధవారం బోరు మోటరు దించి కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.

గర్భిణులకు మెడికల్ కిట్లు

మాడ్గుల, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణీలకు మెడికల్ కిట్లు అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో కిట్లను సమకూర్చగా బుధవారం ఆయన అనుచరులు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కొప్పుల శివకుమార్ పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

షాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): శ్రీరంగపురం మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని లక్ష్మారావుగూడ కురుమ సంఘం అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన శ్రీరంగపురం మల్లయ్య కుటుంబ సభ్యుడు కుమార్‌కు బుధవారం ఆయన రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కురుమ సంఘం మండలాధ్యక్షుడు మద్దూర్ పాండు, కోశాధికారి కుమార్, సభ్యులు శ్రీశైలం, నర్సింహులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

చేవెళ్ల, మే 21(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ఈనెల 29 వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు ఉంటాయని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ సీఆర్‌పీసీ అమలు చేస్తారని, సమీపంలో ఉన్న జిరాక్స్‌షాపులు మూసివేయాలని ఆయన పేర్కొన్నారు.



శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్

సాంకేతిక విద్యాబోధన అవసరం

» ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్

కొత్తూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలుపరుస్తున్న సాంకేతికను ఉపయోగిస్తూ విద్యార్థులకు బోధించాలని, సాంకేతికపై ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో అవగాహక కల్పించేందుకే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ సూచించారు. విద్యను బలోపేతం చేసేందుకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని బుధవారం డైరెక్టర్ రమేష్ సందర్శించారు. శిక్షణ అందజేస్తున్న ఆర్‌పీలతో పాటు ఉపాధ్యాయులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న నూతన స్కీంలు, పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. శిక్షణ కేంద్రం పనితీరుపై డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులను సన్మానించారు. కోర్సు డైరెక్టర్ స్థానిక ఎంఈవో అంగోర్ నాయక్ మాట్లాడుతూ బడి బాట ద్వారా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఆర్‌పీలు సులేమాన్‌రాజు, సత్యనారాయణ, శ్రీలత, అన్నపూర్ణ, వసంతలక్ష్మి, శోభరాణి, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడ్తాల్ ఎస్సైకి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు

కడ్తాల్, మే 21(ఆంధ్రజ్యోతి): కడ్తాల్ ఎస్సై వరప్రసాద్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. 2024లో ఉత్తమ నేర పరిశోధనకుగాను అవార్డు లభించింది. తెలంగాణ పోలీసు శాఖ ప్రతీ ఏటా ఉత్తమ నేర పరిశోధనలకు రాష్ట్రస్థాయిలో అవార్డులు ప్రదానం చేస్తుంది. కడ్తాల్ మండలం మక్తమాదారం వద్ద జరిగిన ఓ హత్య కేసును సమయస్ఫూర్తితో ఛేదించినందుకు ఉత్తమ నేర పరిశోధన అవార్డుకు అప్పటి సీఐ వరప్రసాద్, ఎస్సై వరప్రసాద్, హోంగార్డు పాండులను అవార్డులకు ఎంపిక చేశారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై వరప్రసాద్‌కు డీజీపీ జితేందర్ అవార్డుతో పాటు క్యాష్ రివార్డును అందించారు. వరప్రసాద్‌ను డీజీపీ అభినందించారు. రాష్ట్రస్థాయిలో నేర పరిశోధన అవార్డు రావడం పట్ల వరప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. అవార్డు విధుల పట్ల తన బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు.



డీజీపీ నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్సై వరప్రసాద్



జగ్గంగూడ పంచాయతీ వద్ద కార్మికులు

70మంది కార్మికులకు విముక్తి

మూడుచింతలపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గంగూడ పరిధిలోని ఇటుకబట్టీలో ఒడిశాకు చెందిన కొందరు కార్మికులు పనిచేస్తున్నారు. అయితే వారిని ఇటుకబట్టీ యజమాని హింసిస్తున్నాడని, వసతులు కల్పించకపోగా వేతనాలు కూడా ఇవ్వడంలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం అధికారులు 70మంది కార్మికులను వెట్టి చాకిరీ నుంచి రెస్క్యూ చేసి కాపాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో పేదల సొంతింటి కల సాకారం

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల్: మక్తమాదారంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్/ఆమనగల్లు, మే 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో నిరుపేద కుటుంబాల దశాబ్దాల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో సాకారమవుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం, నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. కడ్తాల మండలం మక్తమాదారంలో 21 మందికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్‌లను బుధవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే అందించారు. అదేవిధంగా మక్తమాదారం నుంచి పెద్దిరెడ్డి చెరువు తండా వరకు నూతనంగా నిర్మించే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆమనగల్లు మండలం సీతారాంనగర్ తండా, సంకటోనిపల్లిలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ సురేశ్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవోలు సుజాత, మాధురి, ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, నాయకులు బీక్యానాయక్, గుర్రం కేశవులు, ధనుంజ, అనిత, విజయ్, బీచ్యానాయక్, జగన్, మానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి



అహల్యాబాయిహోల్కర్ జయంతి కార్యక్రమంలో మహిళలు

ఘట్‌కేసర్ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): ధీర వనిత రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలను బుధవారం ఎదులాబాద్‌లోని రంగనాయకస్వామి ఆలయంలో నిర్వహించారు. జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి భోగ శ్రావణి మాట్లాడుతూ.. అహల్యాబాయిహోల్కర్ దేశంలో మొట్టమొదట సైనిక దళాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, లక్ష్మి, శోభారెడ్డి, విజయలక్ష్మి, సుగుణ పాల్గొన్నారు.

31 వరకు అహల్యాబాయి హూల్కార్ జయంతి వేడుకలు

వికారాబాద్: అహల్యాబాయ్ హూల్కర్ జయంతి వేడకల్లో భాగంగా మే 21 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో ఆలయాల్లో హారతి, మహిళా నాయకులతో, చేనేత కార్మికులతో సమ్మేళనాలు, శోభాయాత్రలు నిర్వహిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం అహల్యాబాయి 300వ జయంతి ఉత్సవాల్లో సందర్భంగా కార్యవర్గ సమావేశం జిల్లా కన్వీనర్ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్లు విజయలక్ష్మి, మాధవి, మహిళా మోర్చా అధ్యక్షులు అన్నపూర్ణ, మహేశ్వరి, మోహన్‌రెడ్డి, సుధాకర్, గోవర్ధన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

ఆధ్యాత్మికతతో స్నేహభావం పెంపు

షాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ఐక్యత వెల్లివిరుస్తుందని, స్నేహభావం పెంపొందుతుందని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాందార్‌ఖాన్‌పేట్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ఐక్యత వెల్లివిరుస్తుందన్నారు. ఆపదలో ఉన్నప్పుడు గ్రామ దేవతలే కష్టనష్టాల నుంచి కాపాడుతారని, బొడ్రాయి ఉత్సవాలను ఊరంతా ఏకమై కులమతాలకతీతంగా జరుపుకోవాలన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు లింగం, జనార్దన్‌రెడ్డి, ఖాజామియాపటేల్, నాయకులు సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గౌరీశ్వర్, శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు. అదేవిధంగా షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు ఆయనను సన్మానించారు.



బొడ్రాయి పూజలో పట్నం మహేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు

లారీలు రావు.. ధాన్యం పోదు

బొంరాస్‌పేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే తూకం వేసిన వడ్లను మిల్లులకు తరలించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. మండలంలోని మెట్లకుంట, బొంరాస్‌పేట్, కొత్తూర్ ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం బస్తాలు తూకం వేసి రవాణాకు సిద్ధంగా ఉంచినా లారీలు రాకపోవడంతో అకాల వర్షానికి ధాన్యం తడిసిపోతుంది. మెట్లకుంట ఐకేపీ కేంద్రంలో 10 లారీల ధాన్యం బస్తాలు కాంటి వేసి ఉన్నా వారం రోజులుగా లారీలు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. బొంరాస్‌పేట్‌లో ఎనిమిది లారీల ధాన్యాన్ని తూకం వేసి ఉంచినా రెండు రోజులుగా ఒక్క లారీ కూడా రాలేదు. లారీల కోసం ఈసారి ముగ్గురు కాంట్రాక్టర్‌లను ఏర్పాటు చేసినా ఫలితం లేకుండాపోతోంది.



బొంరాస్‌పేట్‌లో తూకం వేసి నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు

పచ్చిరొట్టతో ఎన్నో లాభాలు



- కొత్తూర్ ఏవో గోపాల్

కొత్తూర్, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వరి కోతలు తుది దశకు చేరుకున్నాయి. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. వానకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పొలాలను సిద్ధం చేసుకునేందుకు గాను వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు సదస్సులు నిర్వహించి నేల సారం, అధిక దిగుబడులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా కొత్తూర్ మండల వ్యవసాయాధికారి గోపాల్ 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న: వానాకాలం సీజన్‌కు రైతులకు ఎలాంటి సూచనలిస్తున్నారు?

జవాబు : వరి కోతలు పూర్తి కాగానే నేల సారం పెంచేందుకు పొలంలో పచ్చిరొట్టను చల్లుకోవాలి. 40 రోజుల్లో పచ్చిరొట్ట ఏపుగా పెరుగుతుంది. నేల పదనును పెంచుతుంది.

ప్రశ్న: పచ్చిరొట్టతో ఎలాంటి లాభాలు చేకూరుతాయి?

జవాబు : పచ్చిరొట్ట పెరిగిన తర్వాత పొలంలోనే కలియదున్నాలి. దాంతో పంటకు ఎంతో సారం లభిస్తుంది. పచ్చిరొట్ట వల్ల నైట్రోజన్, భాస్వరం లభిస్తుంది. సూక్ష్మజీవులను కాపాడుతుంది. దాంతో భూసారం పెరుగుతుంది. రైతులకు ఖర్చులు తగ్గి దిగుబడి పెరుగుతుంది.

ప్రశ్న: రసాయన ఎరువుల వాడకం మంచిదేనా?

జవాబు : రసాయన ఎరువులు తక్కువగా వాడితే మంచిది. వరి పంట పూర్తి కాగానే కొయ్యలను పొలంలోనే దున్నించాలి. జనుము విత్తనాలు చల్లిన తర్వాత 40 రోజుల్లో పూతకు వస్తాయి. ఆ తర్వాత పొలంలోనే దున్నించినట్లయితే సారం పెరుగుతుంది. దాంతో 50శాతం వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గించవచ్చు.

ప్రశ్న: వరి కొయ్యలను పొలంలో కాల్చవచ్చా?

జవాబు : వరి కొయ్యలను ఎట్టి పరిస్థితుల్లో పొలంలో కాల్చరాదు. దాంతో భూమి సారం కోల్పోతుంది. భూమిలో ఉండే సూక్ష్మజీవులు చనిపోతాయి. దాంతో రైతుకు లాభం కంటే నష్టం వాటిల్లుతుంది.

క్రైం కార్నర్

పెళ్లికావడం లేదని యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్ గౌడ్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కావడం లేదని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దతూప్ర గ్రామానికి చెందిన పాలమూరు ప్రవీణ్‌గౌడ్ (33) కొంత కాలంగా పెళ్లి చూపులకు వెళ్తున్నాడు. కానీ ఒక్క సంబంధం కూడా ఖాయం కావడం లేదు. దాంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి అద్దె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని ఉస్మానియాకు పంపించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో మరొకరు..

ఆదిభట్ల, మే 21(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పితో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఓ యువకుడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతిచెందిన ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌కు చెందిన మదను అవినాష్ (20) ప్రైవేటు ఉద్యోగి. కొంతకాలం నుంచి కడుపునొప్పి ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మంగళవారం ఉద్యోగానికి వెళ్లకుండా ఇంటివద్దనే ఉన్నాడు. తల్లిదండ్రులు పనిమీద వెళ్లగా అవినాష్‌కు తీవ్ర కడుపు నొప్పి రావడంతో భరించలేక ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నితో ఉరేసుకున్నాడు. తండ్రి ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతున్న అవినాష్‌ను కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతిపట్ల అనుమానాలు లేవని కుటుంబసభ్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపారు.

చెరువులో దూకి వృద్ధురాలు..!

షాద్‌నగర్ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): షరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు ఎల్లమ్మ(70) బుధవారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎల్లమ్మ నెల రోజులపాటు ఉస్మానియాలో చికిత్స పొందినట్లు తెలిపారు. బుధవారం గ్రామ సమీపంలోని చెరువు వద్ద చెప్పులు, రూ.500, మందుల చిట్టీలు పెట్టి నీటిలో దూకింది. మృతదేహం ఒడ్డుకు చేరడంతో గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



నర్సింహ

యాచారం, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన మల్కాపురం నర్సింహ(65) ఈనెల 7న కూలి పని మాట్లాడుకొని వస్తానని ఇంట్లోచెప్పి బయలకు వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాలేదని, గ్రామంలో, బంధువుల వద్ద వెతికినా జాడ తెలియరాలేదని బుధవారం నర్సింహ కుమారుడు శివశంకర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ ఎస్సై తేజంరెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

లాల్‌పహాడ్ గెస్ట్‌హౌస్‌లో చోరీ

చౌదరిగూడ, మే21(ఆంధ్రజ్యోతి): ఇంటితాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్‌లో చోటుచేసుకుంది. జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు.. తూంపల్లి గ్రామంలోని బోయ రాంచంద్రయ్యకు చెందిన లాల్‌పహాడ్‌లో గెస్ట్‌హౌస్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గేట్, మెన్ డోర్ తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.35వేల నగదు, టీవీ, ఇన్వర్టర్ బాక్స్ ఎత్తుకెళ్లారు. ఈమేరకు రాంచంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

పెళ్లి పేరుతో యువతిని మోసగించిన యువకుడిపై కేసు.. రిమాండ్‌కు తరలింపు

ఆదిభట్ల, మే 21(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని నమ్మించి మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు.. ఆమనగల్లుకు చెందిన పాత్లావత్ సంజీవ(27) ఆదిభట్లలోని టీసీఎస్‌లో పని చేస్తున్నాడు. 2022లో ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మూడేళ్ల పాటు శారీరంగా వాడుకున్న తర్వాత ముఖం చాటేశాడు. ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించి పెళ్లి చేసుకోకుండా నిరాకరించాడు. దాంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి సంజీవను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

పేకాట.. యువత చెడుబాట!

- రోజురోజుకూ పెట్రేగిపోతున్న పేకాటరాయుళ్లు
- ఆకర్షితులవుతున్న యువత
- నగరవాసుల వ్యసనానికి స్థానికులు బలి!
- పశువుల పాకలు, గుడిసెలే స్థావరాలు
- పోలీసులకు దొరక్కుండా జాగ్రత్త..



మహేశ్వరం, మే 21(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోవడమో లేక ఈజీగా మనీ సంపాదించాలనే అత్యాశనో కానీ.. పేకాట వ్యసనంగా మారి ఆర్థికంగా దివాళా తీస్తున్నవారు కోకొల్లలు. ముఖ్యంగా మండల పరిధిలో రోజురోజుకూ పేకాట స్థావరాలు పెరిగిపోతున్నాయి. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన పేకాట ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో చాపకింద నీరులా విస్తరిస్తోంది. దాంతో ఎంతోమంది యువత ఆర్థికంగా దివాలా తీసేందుకు దారులువేస్తోంది. మండలంలోని మన్‌సాన్‌పల్లి చౌరస్తా, కొళ్లపడకల్, దుబ్బచర్ల, కల్వకోల్, మహేశ్వరం, తుమ్మలూరు, సుభాన్‌పూర్, కేకే బస్తీ, మొహబ్బత్‌నగర్, నాగారం, నందుపల్లి, కొత్తతండా, చిన్నతూప్ర, డబిల్‌గూడ, పెండ్యాల గ్రామాలతో పాటు పలు తండాల పరిసర ప్రాంతాల్లో పేకాట స్థావరాలు విస్తరిస్తున్నాయి. ఫాంహౌస్‌లలో పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందుతుందనే ఆలోచనతో.. పేకాటరాయుళ్లు ఎవరికీ అనుమానం రాకుండా వ్యవసాయ క్షేత్రాల్లో రైతులకు నయానో భయానో ఇస్తున్నారు. వాహనాలను స్థావరాలకు కిలోమీటరు దూరంలో ఉంచుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా పశువుల పాకలు, రైతులు పొలాల్లో వేసుకున్న గుడిసెల్లో పేకాట జోరుగా సాగుతోంది. 2025 ఫిబ్రవరి 5న మండల పరిధిలోని తుమ్మలూరులో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఎస్వోటీ, సివిల్ పోలీసులు అదుపులోకి తీసుకొని రూ.21వేలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కొంతకాలం చడీచప్పుడు లేకుండా ఉన్న పేకాట రాయుళ్లు మళ్లీ ఆట మొదలుపెట్టారు. ఎస్వోటీ లేదా ఉన్నత స్థాయి పోలీసుల దాడులు జరిగినప్పుడు మాత్రమే ఈ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కానీ, కానిస్టేబుల్ స్థాయి వారికి పేకాట శిబిరాలపై పక్కా సమాచారం ఉన్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నగరం నుంచి కొందరు వ్యక్తులు ఆటోల్లో వచ్చి స్థానికంగా పరిచయం ఉన్న వ్యక్తులతో ఈ తతంగం నడిపిస్తున్నారు. పేకాట రాయుళ్లకు సమయానికి చాయ్ ఇతర మర్యాదలు చేస్తూ ఆట ఆడిపించడంలో కొందరు వ్యక్తులు రైతుల రూపంలో ఈ వ్యవహారం నడిపిస్తున్నారనే వార్తలు మహేశ్వరంలో జోరుగా వినిపిస్తున్నాయి. నగరం నుంచి గ్రామీణ ప్రాంతాలకు వచ్చి పేకాట ఆడుతున్న వారిని చూసి ఇక్కడి యువత వారి దారిలో పయనిస్తూ వ్యసనాలకు బానిసలు కావడంతో పాటు అప్పులు చేసి ఆర్థికంగా కుంగిపోతున్నారు. పోలీసులు దాడి చేసేందుకు వెళ్లగా స్థావరం నుంచి పారిపోయిన ఘటనలూ ఉన్నాయి.

పేకాట ఆడితే కఠిన చర్యలు



పేకాట ఆడుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మండలంలోని అన్ని ప్రాంతాల్లో మా సిబ్బందితో పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు పెట్టాం. ఎవరు ఆట ఆడినా.. ప్రోత్సహించినా చర్యలు తీసుకుంటాం. రెండు సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు మండలంలో మూడు స్థావరాలపై దాడి చేసి పలువురిపై కేసులు నమోదు చేశాం.

- హెచ్. వెంకటేశ్వర్లు, సీఐ, మహేశ్వరం

రాజీవ్‌గాంధీతోనే దేశంలో విప్లవాత్మక మార్పులు



షాద్‌నగర్ : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీతోనే దేశంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాజీవ్ 34వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చెన్నయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు అగ్గనూరు బస్వం, చెంది తిరుపతిరెడ్డి, జమ్రుత్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి : రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, బిచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, మానయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులతో కలిసి రాజీవ్‌గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిక్యానాయక్, మోహన్‌రెడ్డి, చేగురి వెంకటేశ్, గుర్రం కేశవులు, మిట్టపల్లి అంజయ్య, అప్పం శ్రీను, సత్యం, షాబుద్దీన్, ధనుంజయ, కృష్ణ నాయక్, బాలరాజ్, శ్రీశైలం, శ్రీకాంత్, ఖాదర్, రామకృష్ణ, నాజర్, యాదగిరి, డాక్టర్ శ్రీను, తదితరులున్నారు.

షాబాద్ : ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచులు ఖాజామియాపటేల్, జనార్దన్‌రెడ్డి, నర్సింహులు, రవీందర్‌నాయక్, నాయకులు మహేందర్‌గౌడ్, సుభాష్‌రెడ్డి, గౌరీశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, సాయి, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్ : రాజీవ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్ రూరల్ : నిరుపేదల పెన్నిధి రాజీవ్‌గాంధీ అని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. హిమాయత్ నగర్ చౌరస్తాలోని రాజీవ్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ నివాళులర్పించారు. పీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్, మండలాధ్యక్షుడు మాణయ్య, షాబాద్ దర్శన్, వీరభద్రస్వామి, సంజీవరెడ్డి తదితరులున్నారు.

యాచారం : మండల కేంద్రంలో నాయకులు రాజీవ్‌గాంధీ వర్ధంతిని జరపడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని చెప్పవచ్చు. మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ విగ్రహం వెలవెలబోయింది. కాగా, కనీసం విగ్రహాన్ని శుభ్రం చేసి పూలమాల వేసిన నాయకుడూ కరువయ్యాడు.

నందిగామ : మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు జిల్లెల్ల రాంరెడ్డి, కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, జిల్లెల్ల బాల్‌రెడ్డి, రాజు నాయక్, సి.నర్సింలు. ఏదిర శ్రీకాంత్‌గౌడ్, సి.కృష్ణ, టైలర్ కృష్ణ, లక్ష్మణ్ నాయక్, వెంకట్‌రెడ్డి, లింగం, శివ, జంగయ్య, తదితరులున్నారు.

మంచాల : ఆధునిక స్ఫూర్తికుడిగా రాజీవ్‌గాంధీ ప్రాచుర్యం పొందారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండు చౌరస్తాలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, ఎల్లేష్, జయానంద్, వాజీద్, మార సురేష్, చంద్రయ్య, సికిందర్‌రెడ్డి, రాజేష్, బి.బిలేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : రాజీవ్‌గాంధీ వర్ధంతిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నాయకులు

ఎండ, వాన.. దోబూచులాట

(ఐదో పేజీ తరువాయి)

18.3 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. మరో రెండు రోజులు ఇదే రకమైన వాతావరణం ఉండే అవకాశం ఉందని వాతావరణం శాఖ పేర్కొంటుంది. ఇబ్రహీంపట్నం టౌన్‌తోపాటు మండలంలో బుధవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మొయినాబాద్ మండలంలో భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో రోడ్లన్నీ చెరువులను తలపించాయి. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై అజీజ్‌నగర్ చౌరస్తా, హిమాయత్ నగర్ చౌరస్తాల వద్ద వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. షాబాద్ మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ఎగువన కురిసిన భారీ వర్షానికి బొబ్బిలిగామ వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో గ్రామస్తుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రతీ ఏడాది చిన్నపాటి వాన పడినా వాగుపై నుంచి నీరు పారుతుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాగు వద్ద బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో భారీ వర్షం కురిసింది. చౌదరిగూడ శివారులోని ఎర్రం చెరువు, పెట్రోల్ పంపు సమీపంలో పిడుగు పడింది. దీంతో ఆ ప్రాంతంలో మంటలు ఎగిసిపడ్డాయి. యాచారం, మాల్, మంతన్‌గౌరెల్లి, నానక్‌నగర్, తమ్మలోనిగూడ తదితర గ్రామాలలో వాన దంచికొట్టింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో నానక్‌నగర్‌లో రోడ్డు జలమయమైంది. అలాగే యాచారం మండల కేంద్రంలో సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలవడంతో ట్రాఫిక్‌జామ్ అయ్యింది.



హిమాయత్ నగర్ చౌరస్తాలో వర్షపు నీరు



యాచారం : నజ్దిక్‌సింగారంలో తడిసిన ధాన్యం

ముగిసిన కుట్టు శిక్షణ శిబిరం

మంచాల, మే 21(ఆంధ్రజ్యోతి): స్ట్రీట్‌కాజ్ గురునానక్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంచాల మండల పరిధి జాపాలలో మహిళలకు కుట్టు శిక్షణ శిబిరం ఏర్పాటుచేశారు. వారం రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో స్థానిక మహిళలకు కుట్టు పనిలో మెళకువలు, బ్లౌస్, కుర్తా కటింగ్ డిజైనింగ్‌పై సమగ్ర శిక్షణ పొందారు. వీరికి వివిధ రకాల డిజైన్లను రూపొందించే పద్ధతులను నేర్పించారు. శిబిరం ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్ట్రీట్‌కాజ్ జీఎన్‌ఐ సంస్థ ఆధ్వర్యంలో జాపాలకు నాలుగు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు పార్వతి, విజయలక్ష్మిలు మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని లబ్ది పొందాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చౌదరిగూడ, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లికి చెందిన గండె కిష్టయ్యకు మంజూరైన రూ.31వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదల వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ వరం లాంటిదని అన్నారు.

ఘనంగా గోలి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఆమనగల్లు : కేక్ కట్‌చేస్తున్న పత్యానాయక్, ఖలీల్, సుభాష్



కడ్తాల్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండల కేంద్రాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. పలు చోట్ల మొక్కలు నాటి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గోలి శ్రీనివాస్‌రెడ్డికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపల్ కన్వీనర్ నేనావత్ పత్యానాయక్, నాయకులు పంతునాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనునాయక్, కమటం వెంకటయ్య, సయ్యద్ ఖలీల్, జహంగీర్, సురమళ్ల సుభాష్, చంద్రశేఖర్‌రెడ్డి, సైదులుగౌడ్, ఈశ్వర్, రమేశ్‌నాయక్, సతీశ్, ఏనమల్ల రమేశ్, జంతుక కిరణ్, శివ, దేరంగుల వెంకటేశ్, మహేశ్ నేత, గుండుమళ్ల రాములు, ఎన్ఎస్ఆర్ జగన్, చక్రి, ఎల్.రాఘవేంద్ర, గణేశ్, శివ, లడ్డు, హమ్లా, కార్తీక్, భరత్, సిద్దిగారి మణికంఠ, నవీన్, సోను, చిట్టి, మంకీ శ్రీకాంత్, రాజు, కంబాలపల్లి అంజి కార్తకర్, శివ, సంతోష్, నిఖిల్ సాయి, అరవింద్, బురిగల నరేశ్, సిద్దిగారి శివ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో కృష్ణానాయక్, జంగారెడ్డి, దావుత్‌గూడ గ్రామస్థులు

హామీల అమలుకు ప్రభుత్వం కృషి

కందుకూరు, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు అన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మంజూరు చేసిన పత్రాలను మండలంలోని దావుత్‌గూడ, పెద్దతండా గ్రామాలలో బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ ఇల్లులేని పేద కుటుంబాలకు పక్కా ఇల్లు నిర్మించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని తెలిపారు. రాజకీయాలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అందుతాయని గుర్తుచేశారు. అలాగే మండలంలోని బాచుపల్లిలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డిలు 23మంది లబ్ధిదారుల ఇళ్లకు భూమిపూజ చేశారు. మాజీ సర్పంచ్ విజయరాజునాయక్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, కార్యదర్శులు, చందు, శ్రీనివాస్, నాయకులు అనేగౌని నవీన్‌గౌడ్, ఎర్ర మాధవి, యుగేందర్‌రెడ్డి, వి.కృష్ణ, కత్తుల వెంకటేష్, రాములు, ఎం.రాజు, కె.నరేందర్, ఆర్.శంకర్, నేచ్యానాయక్, రవి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఎప్పుడిస్తారు?



మాట్లాడుతున్న సత్తిరెడ్డి

చేవెళ్ల, మే 21(ఆంధ్ర జ్యోతి): ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఎప్పుడిస్తారని సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దేవునిఎర్రవల్లిలో గ్రామ కార్యదర్శి వినోద ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు రూ.2500 ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రైతు భరోసా కూడా చాలామంది రైతులకు రాలేదన్నారు. హైదరాబాద్ నుంచి చేవెళ్ల మీదుగా బీజాపూర్ హైవేపై నిత్యం ప్రమాదాలు జరిగి వాహనదారులు, ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారని, త్వరగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. అనంతరం సీపీఐ గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వినోద, సహాయ కార్యదర్శిగా రుక్కమ్మ, సభ్యులుగా పెంటమ్మ, కృష్ణవేణి, రాములమ్మ, నరేష్, మహేందర్‌లను ఎన్నుకున్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం

చౌదరిగూడ, మే 21(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కొందుర్గు ఎంపీడీవో లక్ష్మీఅనురాధ తెలిపారు. నేడు(గురువారం) కొందుర్గు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11:30 గంటలకు మండల ప్రత్యేకాధికారి రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సమావేశానికి గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలన్నారు. అదేవిధంగా అర్హులైన లబ్ధిదారులు ఈనెల 25వ తేదీలోపు ఇంటి నిర్మాణాల పనులు ప్రారంభించుకోవాలని ఆమె సూచించారు.

సున్నం చెరువుకు మహర్దశ

(ఐదో పేజీ తరువాయి)



బతుకమ్మలు నిమజ్జనం చేయడానికి నిర్మించిన ఘాట్

ఒకటైన సున్నంచెరువుకు మరమ్మతు చేసేందుకు అమెజాన్ ముందుకు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కట్ట మరమ్మతులతో పెరగనున్న నీటి మట్టం

సున్నం చెరువుకు 246 ఎకరాల ఆయకట్టు ఉంది. కట్ట వెడల్పు, అలుగు మరమ్మతులు చేపట్టడం వలన వర్షం నీరు వృథా(జాలు)గా పోకుండా ఉంటుంది. ఈ చెరువు పూర్తిగా నిండితే కొత్తగూడ, కొత్తూరు, గూడూరు, మాలగూడూరు తదితర గ్రామాలలో భూగర్భజలాల నీటి మట్టం పెరగనున్నాయి.

కట్టపై బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు

కొత్తగూడ గ్రామస్తులు ప్రతీ సంవత్సరం బతుకమ్మ సంబురాలను జైత్వారం గ్రామానికి వెళ్లే రహదారిపై జరుపుకునే వారు. అమెజాన్ సంస్థ ప్రతినిధులు చెరువు కట్టపై కట్టమైసమ్మ దేవాలయం ఎదుట బతుకమ్మ నిర్వహణకు ఏర్పాట్లు చేయించారు. అలాగే బతకమ్మలను చెరువులో నిమజ్జనం చేయడానికి మెట్లను ఏర్పాటు చేశారు. అయితే నెల రోజులుగా చేపట్టిన చెరువు కట్ట వెడల్పు, అలుగు పనులను అమెజాన్ సంస్థ ప్రతినిధులు గురువారం సాయంత్రం 3 గంటలకు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు యాదగిరి ఈ సందర్భంగా తెలిపారు.

విద్యుత్ అధికారుల కొత్త ఫోన్ నంబర్లు

చౌదరిగూడ మే21(ఆంధ్రజ్యోతి): కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల విద్యుత్ శాఖ అధికారులకు ప్రభుత్వం నూతన ఫోన్ నంబర్లను కేటాయించింది. ఏఈ-8712470199, వీరన్నపేట్ సబ్‌స్టేషన్-8712470183, ఎదిర సబ్‌స్టేషన్-8712470185, కొందుర్గు మండల విద్యుత్ శాఖ అధికారుల నెంబర్లు.. ఏఈ-8712470173, చిన్న ఎల్కిచర్ల సబ్‌స్టేషన్-8712470165, ఉత్తరాస్‌పల్లి, కొందుర్గు సబ్‌స్టేషన్-8712470184 నంబర్లను కేటాయించారు.

ఫరూఖ్‌నగర్ మండలంలో..

షాద్‌నగర్‌రూరల్ : షరూఖ్‌నగర్ మండలంలోని అధికారుల ఫోన్ నెంబర్లు.. ఫరూఖ్‌నగర్ సబ్ స్టేషన్-8712470190, మొగిలిగిద్ద సబ్ స్టేషన్-8712470193, ఏఈ రూరల్-8712470172, కమ్మదనం సబ్‌స్టేషన్-8712470188, చించోడు సబ్‌స్టేషన్-8712470191, రాయికల్ సబ్ స్టేషన్-8712470192, గంట్లవెల్లి స్టేషన్-8712470194, వెలిజర్ల స్టేషన్-8712470195, చటాన్‌పల్లి స్టేషన్-8712470161, విఠ్యాల స్టేషన్-8712470167, బూర్గుల సబ్‌స్టేషన్-8712470168 నంబర్ కేటాయించారు.

కొత్తూర్ మండలంలో..

కొత్తూర్ : మండలంలోని విద్యుత్ సిబ్బందికి ట్రాన్స్‌కో నూతన ఫోన్ నంబర్లను కేటాయించింది. ఏఈ రమేష్-8712470174, కొడిచర్ల సబ్‌స్టేషన్-8712470157, మల్లాపూర్ సబ్‌స్టేషన్-8712470158, తిమ్మాపూర్ సబ్‌స్టేషన్-8712470164, ఇన్ముల్‌నర్వ సబ్‌స్టేషన్-8712470187 నెంబర్లు కేటాయించినట్లు అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు.